క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రత్యేక పూజలు



పూజలో హిందూ వాహినీ సభ్యులు

కొడంగల్: పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయ స్వామి ఆలయంలో 99 వారాలుగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగిస్తున్నారు. హిందూవాహినీ ఆధ్వర్యంలో భక్తులు ప్రతీ శనివారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. ప్రతీవారం సిద్దనొంపు ఆలయానికి వెళ్లి పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రావణ మాసం నాలుగో శనివారం ఉదయం పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జాతర ప్రశాంతంగా నిర్వహించాలి

రూరల్ సీఐ నగేశ్



అంబురామేశ్వరస్వామి జాతర నిర్వాహకులతో సీఐ నగేశ్ తదితరులు

తాండూరు రూరల్: తట్టెపల్లి శివారులో నిర్వహించనున్న జాతర ప్రశాంతంగా జరుపుకోవాలని తాండూరు రూరల్ సీఐ నగేశ్ పేర్కొన్నారు. శనివారం తట్టెపల్లి ప్రాంతంలోని అంబు రామేశ్వర దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లపై నిర్వాహకులతో సీఐ మాట్లాడారు. శ్రావణ మాసం చివరి సోమవారం నిర్వహించనున్న జాతరకు అన్ని ఏ ర్పాట్లు చేశామని నిర్వాహకులు బదులిచ్చారు. తాగి ఎవరైన జాతరలో గొడవలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జాతరకు పార్కింగ్, వీఐపీల దర్శనంతో పాటు పలు ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వేణుకుమార్, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఎన్వీబీడీసీ పరిగి సెక్టార్ అధికారి వెంకన్న, డాక్టర్ మనీశ్



పుట్టపహాడ్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్వీబీడీసీ పరిగి సెక్టార్ అధికారి వెంకన్న, డాక్టర్ మనీశ్ పేర్కొన్నారు. శనివారం పుట్టపహాడ్‌లో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 34 మందికి పరీక్షలు చేయగా వారికి డెంగ్యూ, మలేరియా సోకలేదని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా లాంటి వైరల్ జ్వరాలు వస్తున్నాయని, ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని వినతి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని తోల్‌కట్ట–నక్కలపల్లి రోడ్డు అధ్వానంగా మారిందని, అధికారులు బీటీ వేయించేందుకు కృషి చేయాలనికాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బొక్క వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు తోల్‌కట్ట–నక్కలపల్లి రోడ్డు అభివృద్ధికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో మారుమూల గ్రామాలు తోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. పది సంవత్సరాల నుంచి ఈ రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదన్నారు. దీంతో రోడ్డుపై గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారడంతో వాహదారులు ఇబ్బంది పడుతున్నారని, బీటీ వేసి రోడ్డును బాగుచేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి స్పందించి ఈ రోడ్డు విషయమై త్వరలో అధికారులతో కలిసి పరిశీలించి.. బీటీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, జంగయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



వరినాట్లు వేస్తున్న కూలీలు

- కూలీల కొరత
- ఆటోల్లో తరలింపు
- పెరిగిన కూలి
- ఇబ్బందుల్లో అన్నదాతలు

దౌల్తాబాద్: ప్రస్తుతం వర్షాలు సంమృద్ధిగా కురుస్తుండడంతో మండలంలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. కొందరు జులైలో మొదలు పెట్టగా, ఇంకొందరు ఆగస్టు మొదటి వారంలో చేపట్టడంతో ఈ ప్రాంతంలో ముమ్మరంగా ఊపందుకున్నాయి. వ్యవసాయ బావులు, చెరువుల కింద వరినాట్లు వేస్తున్నారు. జులైలో వేసిన వరినాట్లకు, పత్తిలో కలుపు తీయిస్తుండడంతో కూలీల కొరత ఏర్పడింది. వారికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. మండలంలోని పలు గ్రామాల రైతులు వివిధ ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవసరం మేరకు వారిని ఆటోలు, ట్రాలీ ఆటోల్లో, ట్రాక్టర్లలో తీసుకొస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతుండడంతో మహిళా కూలీలకు కూడా కూలి పెరిగింది. ప్రధానంగా వ్యవసాయం చేసే నందారం, ఇండాపూర్, యాంకి, దేశాయిపల్లి, గోకఫసల్‌వాద్, పోల్కంపల్లి, బాలంపేట, సురాయిపల్లి పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానికంగా కూలీల కొరత ఏర్పడడంతో వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ రేటు చెల్లించి ఆటోల్లో తరలిస్తున్నారు. రోజు కూలి రూ.350 నుంచి రూ.400 వరకు చెల్లించాల్సి వస్తోందని సదరు రైతులు వాపోతున్నారు. దీంతో అవసరాన్ని బట్టి కూలీలను ఒక్కో ఆటోల్లో సుమారు 12నుంచి 18మంది వరకు తరలిస్తున్నారు. కాగా కూలీల కొరత సకాలంలో లభించకపోవడంతో కొంత మంది రైతు కుటుంబాలు వంతుల వారీగా పనులు చేయించుకుంటున్నారు. ఈ పనులకు చదువుకున్న విద్యార్థులు సైతం తల్లిదండ్రులతో వంతుల వారీగా చేలల్లో పనులకు వెళ్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో పత్తి కలుపుతీయడంలో సహాయ పడుతున్నారు.

కూలీలతో ఇబ్బంది



కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైతులందరూ ఒకే సారి పనులు మొదలు పెట్టడంతో ఈ సమస్య ఏర్పడింది. పనులకు పిలుస్తుండడంతో కూలీలు రావడం లేదు. కొందరు వంతుల వారీగా వెళ్తున్నారు. స్థానికంగా వ్యవసాయ పనులు ఒకేసారి మొదలవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎవరు చూసినా వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో ఎక్కువ కూలి చెల్లించి పనులకు పక్క ఊరినుంచి తీసుకొస్తున్నాం.

– శివారెడ్డి, రైతు, ఈర్లపల్లి

కనువిందు చేస్తున్న శివసాగర్ అలుగు



మోమిన్‌పేట: నందివాగు ప్రాజెక్టు

యాలాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, ప్రాజెక్టుల అలుగుల పారుతున్నాయి. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ సమీపంలోని కాకరవేణి నదిపై నిర్మాణంలోని శివసాగర్ ప్రాజెక్టు భారీ వర్షంతో నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు అలుగు వద్ద వరద ప్రవహిస్తుంది. అలుగుపై నుంచి వరద పారుతుండటంతో ఆ ప్రాంతం స్థానికులకు కనువిందు చేస్తుంది. యాలాల, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన యువకులు అలుగు వద్దకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారు.

నిండుకుండలా నందివాగు

మోమిన్‌పేట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మోమిన్‌పేటలోని నందివాగు ప్రాజెక్టు నిండి అలుగు పారుతుంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు పొంగి పొర్లడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. పెద్దవాగు క్యాచ్ మెంట్ ఎరియా దుర్గంచెర్వు, పులుమద్ది, కడిచర్ల, కుమ్మరిగూడ గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కాస్లబాదు, రాళ్లగుడుపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అరవింద్ కోరారు.

నేడు రామేశ్వరస్వామి జాతర

మోమిన్‌పేట: శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో రామలింగేశ్వర స్వామి జాతర నిర్వహించనున్నట్లు అర్చకుడు మల్లేశం స్వామి తెలిపారు. ఆదివారం, సోమవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారని వివరించారు.

నేడు లక్ష బిల్వార్చన

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన మహాపూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కపిలేశ్వర సమేత పార్వతిదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీవీరభద్రేశ్వర స్వామి పల్లకీ సేవ, ఊరేగింపు ఉంటుందని కమిటీ సభ్యులు వివరించారు. లక్ష బిల్వార్చనలో పాల్గొనే భక్తులకు పత్రిదళములు అందుబాటులో ఉంటాయని, ఇతర సామాగ్రిని భక్తులు తీసుకరావాలని వారు సూచించారు.

భారీ వర్షం.. మిగిల్చిన నష్టం

చేవెళ్ల: భారీ వర్షంతో వాగుకు ఇరువైపులా ఉన్న రైతుల పంటల పొలాలకు తీరని నష్టం చేకూరింది. మండలంలోని దేవరంపల్లి నుంచి ప్రవహించే ఈసీవాగుకు ఇరువైపులా ఉన్న పంటలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో తీరని నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మండలంతో పాటు ఎగువన వికారాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఈసీ వాగు పొంగి పొర్లి ఉధృతంగా పారింది. దీంతో వాగుకు ఇరువైపులా ఉన్న పంట పొలాలను సైతం వరద ముంచెత్తింది. దీంతో దేవరంపల్లికి చెందిన రైతులు వేసిన పత్తి, వరి, మొక్కజొన్న, క్యారెట్, జొన్న తదతర పంటలు వాగు వరదకు కొట్టుకుపోయి అడ్డం పడిపోయాయి. దీనికి తోడు పంటపొలాల్లో నిలిచిన వరద నీటితో కూడా ఉన్న పంటలు పాడవతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 200ల ఎకరాల వరకు పంటలు నష్టపోయాయని, దెబ్బతిన్న పంటలను అధికారులు, నాయకులు పరిశీలించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్, బీజేపీ నేతల అరెస్టు దారుణం



పోలీస్ స్టేషన్లో బీఆర్ఎస్ నాయకులు

నవాబుపేట: మండలంలో నెలకొన్న సమస్యలను మంత్రులకు వివరించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టులు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. మండల పరిధిలోని చించల్‌పేటలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి వచ్చిన మంత్రులకు మండల సమస్యలను వివరించేందుకు వెళ్లడం తప్పా? అని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దయాకర్ రెడ్డి, శాంత కుమార్, సంతోశ్, రాజు, జగన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు..

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు హేయమైన చర్యనన్నారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న రోడ్ల పరిస్థితిని మంత్రులకు వివరించడానికి పోతే పోలీసులు అరెస్టు చేయడం ధారుణమన్నారు. వెంటనే నవాబుపేట మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన రోడ్లను బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జగన్, రమేశ్, గాలయ్య, శ్రీధర్ రావు, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ విమల



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్ఐ విమల

బంట్వారం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విమల పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి బంట్వారం మండలంలోని సల్బత్తాపూర్‌లో పోలీస్ కళాజాత బృందం ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విమల మాట్లాడారు. ఆన్‌లైన్ గేమింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు, సీసీ కెమెరాలు తదితర అంశాలపై ఆమె ప్రజలకు వివరించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం రెడ్డి, అంజిరెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

మండలంలోని తొర్మామిడి గ్రామానికి చెందిన షబానాభేగం, రొంపల్లి నివాసి పాండురంగారెడ్డి మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఇద్దరు బాధితులు వేర్వేరుగా బంట్వారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు నిర్వహించి వాటిని రికవరీ చేశారు. అనంతరం శనివారం బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ విమల తెలిపారు.

కురుమ సంఘం నూతన కమిటీ ఎంపిక



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పూడూరు: మండల కురుమ సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. బీసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్క క్రిష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు మల్లేశ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు అధ్యక్షుడిగా మేడిపల్లి కలాన్ గ్రామానికి చెందిన భూపాల్‌ను ఏకగ్రీవంగా నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా దొడ్డి గోపాల్(పుడుగుర్తి), మండల అధ్యక్షుడిగా బొర్ర భూపాల్ (మేడిపల్లికలాన్), ప్రధాన కార్యదర్శిగా బర్ల శివరాజ్ (కండ్లపల్లి) ఉపాధ్యక్షుడిగా బర్ల వెంకటయ్య (కంకల్), రంగాపురం శివకుమార్ (పెద్ద ఉమ్మెంతాల్) గొల్లగూడం మహేశ్ (చన్గోముల్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన భూపాల్ మాట్లాడుతూ గొల్ల, కురుమలు ఆర్థికంగా ఎదగాలంటే ఐక్యంగా సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. అప్పుడే అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొల్ల, కురుమలు శ్రీనివాస్, అంబయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు.. పూర్తి చేసేదెప్పుడు ?



దుద్యాల్: కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న రాజు నాయక్, రవి చంద్, బిక్య నాయక్



యాలాల: అన్నారం వాగులో దారిని బాగు చేసుకుంటున్న పటేల్‌చింత తండావాసులు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- వర్షానికి కొట్టుకుపోతున్న మొరం, కంకర
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, వాహనదారులు
- బీటీ వేయాలని సంత్రకుంట తండా వాసుల వేడుకోలు

దుద్యాల్: మండల పరిధిలోని సంత్రకుంట తండాకు సత్వరమే బీటీ రోడ్డు పూర్తి చేయాలని తండావాసులు కోరుతున్నారు. తండాకు చెందిన కొందరు కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈర్లపల్లి ప్రధాన రోడ్డు నుంచి సంత్రకుంట తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 2023లో ఎస్టీఎస్‌డీఎఫ్ గ్రాంట్స్ నుంచి పనుల కోసం రూ.1.65కోట్ల నిధులు మంజూరు చేశారు. కొంత వరకు పనులు వేగంగా నిర్వహించి మధ్యలోనే నిలిపేశారు. మరమ్మతుల సందర్భంగా అక్కడ మొరం, కంకర పోసి వదిలేశారు. దీంతో రాకపోకలకు విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు అంచు భాగం మట్టి కొట్టుకుపోయిందన్నారు. త్వరగా బీటీ రోడ్డు పూర్తి చేయకుంటే మొరంతో పాటు కంకర కూడా కొట్టుకోపోయే అవకాశం ఉందని తండావాసులు చెబుతున్నారు. అంతేకాకుండా అదేతండా గ్రామ పంచాయతీకి పాఠశాల భవనం మంజూరైనా నిర్మాణం చేపట్టకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సదరు కాంట్రాక్టర్‌తో అభివృద్ధి పనులు చేయించాలని వారు కోరుతున్నారు.

చింతతండా వాసుల శ్రమదానం

యాలాల: మండలంలోని పటేల్ చింతతండా వాసులు తండా రహదారి బాగు చేయడం కోసం చేయి..చేయి కలిపి శ్రమదానం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అన్నారం వాగు ఉధృతంగా ప్రవహించింది. పటేల్ చింతతండా నుంచి జుంటుపల్లి, తాండూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వరదతో గతంలో వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. శనివారం తండా వాసులు వాగు ప్రాంతానికి చేరుకొని నదిలో నాపరాతి ముక్కలతో దారి మరమ్మతుకు పూనుకున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో దారి మధ్యలోని అన్నారం వాగు కారణంగా రాకపోకలకు అడ్డంకిగా మారుతోందని చెబుతున్నారు. జూన్‌లో అన్నారం వాగుపై బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణానికి గాను రూ. 1.80 కోట్ల ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయని, కానీ పనుల పురోగతి మాత్రం జాడేలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



దోమ: శ్రీకృష్ణుడి ప్రతిమను ఉయ్యాలలో వేసి వేడుకలు



దుద్యాల్: కృష్ణుడు, గోపికల వేశాధారణలో చిన్నారులు



ధారూరు: దాండియా ఆడుతున్న సన్‌షైన్ స్కూల్ విద్యార్థులు



అనంతగిరి: హనుమాన్ మందిరంలో రాధాకృష్ణుల అలంకరణ

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పలు ఆలయాలు భక్తులతో జనసందోహమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దాండియా ఆడారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలో అలరించారు. అక్కడక్కడ ఉట్టీలు కొడుతూ, అన్ని వీధుల్లో సందడి వాతావరణం నెలకొంది.



మోమిన్‌పేట: టేకుపల్లిలో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు



పూడూరు: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



కొడంగల్ : శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



పూడూరులో..



తాండూరు రూరల్: కొత్లాపూర్‌లో శ్రీకృష్ణుడి,రాధ వేషధారణలో చిన్నారులు



అనంతగిరి: గోపిక వేషాధారణలో చిన్నారి



ధారూరు: ధారూరులో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడు